మైన నాటకంగాని నాటికగాని రాసే బుద్ధిమంతుడు తాను క్షుణ్ణంగా ఎరుగని పాత్రలను ప్రవేశపెట్టడు. (ఈ పని కథకుడు చేసి నెగ్గుకురాగలడేమోగాని నాటకకర్తవల్ల కాదు.) అయితే సినిమాలలో ఇది అన్నప్పుడల్లా సాధ్యం కాదు. సినిమా పాత్రలన్నిటిచేతా వాస్తవంగా మాట్లాడించే శక్తి సినిమా రచయితకు ఉండకపోవచ్చు. (గురజాడ అప్పారావులు అన్నప్పుడల్లా రారుకద.)

మరికొన్ని సందర్భాలలో కొన్ని పాత్రలు ప్రచారార్థం ప్రవేశపెట్టబడతాయి — పనిచేసుకునేవాళ్లూ, బిచ్చగాళ్ళూ మొదలైనవి వీటిని వాస్తవికంగా చిత్రించినటయితే కథే చెడుతుంది.

ఇటువంటి సమస్యలు తెచ్చిపెట్టుకోకుండా, తమకు తెలిసిన పాత్రలను మాత్రమే చిత్రాలలో ప్రవేశపెట్టే అధికారమూ, అవకాశమూ గల రచయితలు చాలావరకు సరియైన సంభాషణలను సృష్టించగలుగుతున్నారు. "షావుకారు," "పెళ్ళిచేసిచూడు," "బతుకుతెరువు," "దేవదాసు," "దీక్ష," "కన్నతల్లి," మొదలైన చిత్రాలలోని సంభాషణలు ఈవిధంగా రాణించాయి.

రచయితలకున్న చిక్కే నటులకూ ఉన్నది. అనేకమంది నటులు తమ వృత్తిధర్మాన్ని బట్టి ఏ పాత్రనైనా వేయటానికి సిద్ధంగా ఉండవచ్చుగాని, ఆ పాత్రలన్నిటిలాగా మాట్లాడే శక్తి వారిలో కొందరికి లేకపోవచ్చు. పాత్రకు అనుగుణమైన భాషతో మాట్లాడించాలన్న యత్నం దీక్షగా సాగింది "పల్లెటూరు" "అంతా మనవాళ్ళే!" "జ్యోతి" మొదలైన కొన్ని చిత్రాలలో మాత్రమే.

విమర్శనాదృష్టితో చూస్తే మన సినిమాసంభాషణలలో కనిపించే అనేక లోపాలతోబాటు మన సినిమానటులలో చాలామందికి వాచక సామర్థ్యంలేక పోవటంకూడా ఉంటున్నది. ఈ రెండూ అట్టడుగున ఒకే సమస్యమో. సినిమా చిత్రాలను రేడియోలో సంగ్రహపరచి ప్రసారం చేసిన కాలంలో అచ్చగా సంభాషణలే వినవలసివస్తే వాటిలో ఎంతో వెలితి వినిపించేది. ఇప్పటికైనా సినిమాహాలు బయటఉండి వినేవాడికి ఎంతమంది నటులసంభాషలు నిజంగా బాగుంటాయో చెప్పటం కష్టం.

సంభాషణల రచనవిషయంలోనూ, అందులో పాల్గొనేవాళ్ళ వాచకం విషయంలోనూ సినిమా చిత్రాలకంటె రేడియోనాటికలు ఎక్కువ అభివృద్ధి ప్రదర్శించే అవకాశం లేకపోలేదు. బుచ్చిబాబు, గోరాశాస్త్రి మొదలైన రచయితలు రేడియోనాటకాలలో వాడుతున్న సంభాషణలు సినిమాసంభాషణలకంటె ఒక్కొక్కప్పుడు రక్తిగా ఉండటం జరుగుతోంది. తాము రచించే నాటకాలు శ్రవ్యనాటకాలన్నది జ్ఞాపకం ఉంచుకుని వారు సంభాషణలు రాయటం దానికి తోడ్పడుతున్నదేమో. రేడియోనాటికలలో పాల్గొనే వారిలో కొద్దిమంది అయినా ఆ సంభాషణలను చాలా బాగా ఉచ్చరించటం జరుగుతున్నది. కళ్లు లేనివాడికి సయితం సినిమాసంభాషణలు పాత్రలను ప్రతిబింబించి రక్తి కలిగించేటట్టుగా ఉండాలన్న దృక్పథంతో రచన జరిగితే వాటిస్థాయి పెరుగుతుందేమో.

---

స్కెచ్

# అడ్డదారి

యేర్లగడ్డ శివరామకృష్ణ

బస్సు వచ్చింది. స్టాపులో ఆగింది. బెల్లం మీద మూగే చీమలకుమల్లే ఒకగుంపు బస్సు మీదికి ఎగబడ్డారు.

బస్సు వెళ్ళింది. ప్రయత్నం ఫలించనివాళ్ళు నిరాశ కళ్లల్లో పెట్టుకుని మళ్ళీ పాకనీడకి చేరుకున్నారు.

మళ్ళీ బస్సు వచ్చింది. ఆగింది గుంపు బస్సు మీదికి మళ్ళీ ఎగబడ్డారు. బస్సు వెళ్ళింది. మొహాలు వేలవేసుకున్నవాళ్లు నీడకి చేరుకున్నారు.

మళ్ళీ బస్సు వచ్చింది. వెళ్ళింది. మొహాలు వేలవేసుకున్నవాళ్ళు ఉండనేవున్నారు. వాళ్ళు ఆశావాదులు. వచ్చే ప్రయత్నంలో తాము నెగ్గుతారు.

వాళ్లల్లో నల్లగా పొడుగ్గావున్న కుర్రాడికి ఆశలు చచ్చిపోయినాయ్. చావలేక చచ్చినాయ్.

ప్రొద్దున్నే ప్రాణాలతో వున్న వాటికి మధ్యాహ్నం పన్నెండున్నరగంటలకి ఊపిరి పోయింది. కళ్ళయెదటే ఎనిమిది బస్సులు నిర్దయగా వెళ్ళిపోయెను మరి.

"పెళ్ళిళ్ళ రోజులుగాదూ" అన్నాడు సన్నగా ఎర్రగావున్న కుర్రాడు తన మిత్రుడైన నల్లగా పొడుగ్గావున్న కుర్రాడితో. సన్నటి ఎర్రటి కుర్రాడిలో ఆశ పూర్తిగా చావలేదు. ఏమూలో కొన వూపిరితో వుంది.

"పొద్దునవచ్చాం. మళ్ళీ పెళ్ళివారింటి కెళ్లాలంటే దగ్గరా దాపా, అయినా తిరిగి మళ్ళీ వెడితే ఏం బాగుంటుంది లే" అన్నాడు నాలుకతో పెదిమలు తడి చేసుకోవటానికి ప్రయత్నిస్తూ నల్లగా పొడుగ్గావున్న కుర్రాడు, సన్నగా ఎర్రగావున్న కుర్రాడితో. "ఒక హోటలు గూడా లేదాయెను చచ్చి ఇక్కడ" అన్నాడు మళ్ళీ.

"ఇంకా నయం తాటాకుల పాకన్నా వుంది నీడకి" అన్నాడు సన్నటి ఎర్రటి కుర్రాడు.

బస్సు వచ్చింది "ఈసారి దొరికేనా టిక్కెట్లు" అని సందేహంగా అనుకుంటూ బస్సు దగ్గరికి పరిగెత్తే గుంపులో కలిశాడు సన్నగా ఎర్రగావున్న కుర్రాడు. "అనవసరంగా పరుగెట్టడమేగాని టిక్కెట్లు దొరుకుతయ్యా చస్తయా" అని పెదవి విరుస్తూ బస్సువేపుకు నడిచాడు నల్లగా పొడుగ్గావున్న నిరాశావాది.

నిరాశావాది అంచనా తప్పలేదు. బస్సు వెళ్లిపోయింది. ఆశావాది మొహాలు వేలవేసుకున్న వాళ్ళతో పాటు నీడకి చేరుకున్నాడు.

విజృంభించి గుంపునిచీల్చుకుని ఒళ్ళు హూనం చేసుకుని కండక్టరు దగ్గరకెళ్ళే ధైర్యం వీళ్ళిద్దరి దగ్గరాలేదు. ఇద్దరూ పట్నవాసులు. ఒకవేళ గుంపులో చొరబడే శక్తివున్నా "అనాగరికంగా గుంపులో దూరటమా" అనుకుంటారు క్యాపిటలిస్టా నికి అలవడిన పిరికి.

సన్నటి, ఎర్రటి కుర్రాడిలోవున్న ఆశావాదం పుంజుకుంది. ఉపాయంతో బుద్ధి బలంతో బస్సులో సీట్లుతప్పక సాధించవచ్చుననుకున్నాడు.

ఆడవాళ్ళు శ్రమలేకుండా బస్సెక్కి కూర్చోవటం గమనించాడు ఈ కుర్రాడు. ఉపాయం తట్టి తలపంకించాడు.

ఒక అందమైనపడుచు పిల్ల దడి ప్రక్కగా నిల్చునివుంది. మనవాడు ఆ అమ్మాయిదగ్గరికి వెళ్ళి "ఏ వూరెడతారు?" అన్నాడు. మెల్లిగా చెప్పింది. జవాబు సౌమ్యంగానే చెప్పింది. మన కుర్రాడి తన అవస్థ చెప్పుకోవచ్చనే ధైర్యం కలిగింది. మెల్లమెల్లగా తాము ప్రొద్దుటినుంచీ పడుతున్న అవస్థ అంతా ఆమెముందు వెళ్ళబోసుకున్నాడు. ఇంకొంచెం సేపువుంటే తామిద్దరికీ స్పృహతప్పినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదన్నాడు. మనసులో మాటుని బయటపెట్టి ఒక్క నిశ్వాసం విడిచాడు మనవాడు.

ఆ అమ్మాయి మనసు వెన్నకిమల్లే అయి "బస్సు రానీండి" అన్నది.

బస్సువచ్చింది. గుంపు ఎగబడింది. ఆ పడుచు మనకుర్రాడిదగ్గర డబ్బులు తీసుకుని బస్సుదగ్గరికి నడిచింది.

వయసులోవున్న కండక్టరుకి జనం అంతా చీమలకిమల్లే కనిపించి ఆ అమ్మాయి దేవకన్యకు మల్లే కనపడింది. గబుక్కున జనం మీదగా చెయ్యిజాపి ఆ పడుచుపిల్ల-తన దేవకన్య-చెయ్యికి చెయ్యి తగిలేట్టుగా డబ్బులు తీసుకున్నాడు వయసులోవున్న కండక్టరు.

పాకలోంచి గబగబా వచ్చారు సన్నటి ఎర్రటి కుర్రాడూ, నల్లటి పొడుగాటి కుర్రాడూను.

ఆ అమ్మాయి చేతిటిక్కెట్లు చేతికి చెయ్యి తగిలేటట్టువుంచి పెరపెర చూస్తున్న కండక్టరు "రెండో వార్ని గూడారమ్మనండీ" అన్నాడు. ఆ పడుచు చిన్నగా నవ్వుకుంటూ ప్రక్కనే నిల్చున్న మనవాడిచేతిల్లో ఆ టికెట్లువుంచి "థాంక్స్" అందుకుని వెనక్కు తిరిగింది. కండక్టరు వయసుగాడు గతుక్కుమన్నాడు.

బస్సులో కూర్చున్న మన కుర్రాళ్ళిద్దరికంకా చురచురమాసి ముఖం మాడ్చుకుని ఇంకా బస్సులో మూడుసీట్లు ఖాళీవున్నా క్రిందవున్న జనం అరుస్తున్నా వినిపించుకోక "రైట్ రైట్" అన్నాడు ఆశాభంగం పొందిన కండక్టరు చిరాకుగా.

కండక్టరు అవస్థ కనిపెడుతోన్న సన్నటి ఎర్రటి కుర్రాడు మెల్లగా చిక్కగా నవ్వుకున్నాడు.

★